క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వేలూరు మహేష్

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో నగర 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్కరించారు.

సౌత్‌మోపూరులో సినిమా షూటింగ్



నెల్లూరురూరల్ : రూరల్ మండలంలోని సౌత్ మోపూరులో ఉన్న గ్రామదేవత ఆలయంలో ఫోర్ పిల్లర్స్ ఫిల్మ్‌హౌస్, ప్రొడక్షన్ నంబర్ వన్ బ్యానర్‌పై కొత్త సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి పాల్గొని షూటింగ్‌ను ప్రారంభించారు. ప్రవీణ్ బండ దర్శకత్వంలో నటీనటులు రణధీర్, అనక, మట్ట శీనులపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. సౌత్‌మోపూరు గ్రామంతో పాటు నరసింహకొండ, పండ్లపూడి, మరుపూరు, బుచ్చిరెడ్డిపాళెం, పార్లపల్లి, గంగపట్నం తదితర గ్రామాల్లో 25 రోజులు పాటు షూటింగ్ నిర్వహించనున్నట్లు నిర్మాతలు ముక్కు రాధాకృష్ణగౌడ్, ఈశ్వర్, వెంకీ తెలిపారు.

విజయకుమార్‌రెడ్డితో మహిళా నేతల భేటీ



నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో పార్టీకి చెందిన పలువురు మహిళా నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, రూరల్ సాంస్కృతిక, అంగన్‌వాడీ విభాగాల అధ్యక్షురాలు శారద, శాలినితో పాటు బషీరా, రిజ్వానా పాల్గొన్నారు.

ల్యాబ్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్) : ల్యాబ్ తాళాలను పగులగొట్టి అందులో ఉన్న నగదును గుర్తుతెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పొగతోటలోని భారతి ల్యాబ్‌లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ల్యాబ్ తాళాలను పగులగొట్టి బీరువాలోని రూ.45 వేల నగదును అపహరించుకుని వెళ్లారు. ఉదయం ల్యాబ్ తెరిచేందుకు వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ మన్సూర్ దీనిని గుర్తించి చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ షాలిమ్ ఫిర్యాదు మేరకు చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు. ల్యాబ్‌లోని సీసీ పుటేజీలను సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ కవితా దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం) : పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ కవితా దినోత్సవ వేడుకలు జరుగనున్నాయని ఫౌండేషన్ చైర్మన్ నారాయణరావు బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కవితలను పుస్తక రూపంలో నిక్షిప్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా 'నిర్వేదం' నవల ఆవిష్కరణ జరుగుతుందన్నారు.

కండలేరు బకాయిలను వసూలు చేయాలి

నెల్లూరురూరల్ : కండలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి పూండి వరకు ఉన్న ప్రధాన కాలువ నిర్వహణ కోసం తమిళనాడు ప్రభుత్వం ప్రాజెక్ట్ అధికారులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.300 కోట్ల వరకు ఉన్నాయని, వీటిని వసూలు చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. చెన్నై మెట్రో వాటర్ సభ్యులు, కృష్ణా రివర్ వాటర్ సప్లయ్ సభ్యులు చెన్నైకు తాగునీరు కోసం కండలేరు డ్యామ్‌ను సందర్శించినప్పుడు ప్రాజెక్ట్ అధికారులకు బుధవారం విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు ప్రాజెక్ట్ అధికారులు డ్యామ్ సమర్థవంతంగా నిర్వహణ చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం నుంచి బకాయిలు రాబట్టాలని కోరారు. వాస్తవ పరిస్థితుల్లో లోలెవల్ స్లూయిజ్ గేట్లు మరమ్మతులై కదలని స్థితిలో ఉన్నాయన్నారు.

ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ మృతి

నెల్లూరు(పొగతోట): ఐసీడీఎస్ నెల్లూరు అర్బన్ సూపర్‌వైజర్ సుకన్య గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు సంతాపం తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. త్యాగరాజ కృతుల ఆలాపనతో సంగీతాభిమానులు ఆనందపరవశులయ్యారు. తొలుత వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి పురమందిరం వరకు సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత త్యాగరాజస్వామివారి ఉత్సవమూర్తులు, త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అక్కడి వేదికపై స్వామివార్లను ప్రతిష్ఠించారు. కళాకారుడు ఆత్రేయ కిడాంబి నరసింహన్ పొడి అట్టముక్కలతో తయారు చేసిన త్యాగరాజస్వామి, వెంకటేశ్వరస్వామి, గరుడసేవలో శ్రీరామచంద్రుడు విగ్రహాలను రంగనాయకులపేటలోని వేదాంత దేశికర్ దేవస్థానం నుంచి తీసుకొచ్చారు. తదుపరి గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన పూజలు తదితరాలను నిర్వహించారు.

వీనులవిందుగా..

ఖమ్మం, విజయనగరం, తెనాలి, నెల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన హరికథకులతో హరికథలు, ఔత్సాహిక సంగీత కళాకారులతో త్యాగరాజ కృతుల ఆలాపనలు, శాక్సాఫోన్, కీబోర్డు, గాత్రకచేరీలను వీనులవిందుగా జరిపారు.



త్యాగరాజస్వామి, వెంకటేశ్వరస్వామి, శ్రీరాముల నగరోత్సవం

అలరించిన నృత్య ప్రదర్శనలు

స్థానిక సంగీత విద్వాంసులు, గురువులు సురేష్ రావు, జమ్మలమడక బాలార్క, లక్ష్మీప్రసన్న, రమాదేవి, సత్యవాణి వారి శిష్యబృందంతో పంచరత్న గోష్ఠిగానం కమనీయంగా సాగింది. గురుకృప కళాక్షేత్ర విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. వాద్య సహకారాన్ని లోకేష్, సుబ్రహ్మణ్యం, వనజ, హర, ఈశ్వర్, శివకుమార్ తదితరులు అందించారు.

గాత్ర కచేరి

హైదరాబాద్‌కు చెందిన సంగీత విద్వాంసురాలు చాగంటి రమ్యకిరణ్మయి బృందం ఆధ్వర్యంలో ప్రధాన గాత్ర కచేరి ఓలలాడించింది. భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.



శాస్త్రీయ నృత్య ప్రదర్శన



సంగీత విద్వాంసులచే పంచరత్న గోష్ఠి

రంగడికి పుష్పయాగం

- భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణ

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారికి పుష్పయాగం, దవనోత్సవం కనుల పండువగా జరిగింది. తదుపరి రాత్రి 11 గంటలకు ధ్వజావరోహణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు విశేషంగా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తగా కొండపల్లి అమ్మణ్ణమ్మ దత్త కుమారుడు వెంకటసత్య రవిచంద్ర వ్యవహరించారు. కార్యక్రమాలను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథస్వామికి గురువారం రాత్రి 7 గంటలకు పెన్నానదిలో తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. దీంతో వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంక్ వచ్చేలా కృషి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ



హాజరైన నగరపాలక సంస్థ సిబ్బంది

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పారిశుద్ధ్య విభాగపు వారాంతపు సమీక్షలో భాగంగా శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం ఓటీఫర్ వెబ్, ఓటీఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నగర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పాల్గొని, నిర్దేశించిన పది ప్రశ్నలకు తమ అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. డ్రెయిన్ కాలువల్లో మురుగునీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన చర్యలను సచివాలయాల వారీగా నివేదికలు అందించాలని సూచించారు. డివిజన్ల పరిధిలో మురుగు నిల్వ ఉండకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల ర్యాంపులు, కల్వర్టులు, సివిల్ పనులు, మెష్ ఏర్పాటు, లెవెలింగ్ పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ చేపట్టి కాలువల మురుగు ప్రవాహానికి అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నార, గుడ్డ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ హితమైన ఉత్పత్తుల వినియోగంతో చెత్తను తగ్గించవచ్చన్నారు. వాటర్ ప్యాకెట్ల తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, అమృత్ పథకం పీడీ మాధురి, సూపరింటెండెంట్ సులోచన, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

30న ఉగాది వేడుకలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ట్రంకు రోడ్డు శివాజీ సెంటర్‌లో ఈనెల 30న ఉగాది మహోత్సవాన్ని ఘనంగా, వైభవంగా నిర్వహించనున్నట్లు సింహపురి ఉగాది ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శివాజీ సెంటర్‌లోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో సింహపురి ఉగాది ఉత్సవ సమితి విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది ఉత్సవాల ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలోని అందరినీ సంఘటితం చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ సలహాదారుగా ఆడిటర్ సుబ్రహ్మణ్యం, పిట్టి సత్యనాగేశ్వరరావు, అధ్యక్షుడిగా బీఎస్ రంగరాజన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.ఫణిరత్నం, ప్రధాన కార్యదర్శులుగా వి.హర్షవర్ధన్, జగన్ తదితరులను ప్రకటించారు. కార్యక్రమంలో బి.నాగలక్ష్మి, ఉమాదేవి, జయలక్ష్మి, నీలి రాఘవ, కేవీ సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, బాలసుబ్రహ్మణ్యం, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు) : నగరంలో జరిగే వివాహ శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, ఫంక్షన్ హాల్స్, హోటల్స్, వైన్ షాపులు, రెస్టారెంట్లలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే భారీ జరిమానాలు తప్పవని కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న క్యాటరింగ్ నిర్వాహకులు, వెడ్డింగ్ ప్లానర్స్, ఇతర ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు తక్కువ స్థాయి గల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో నగరానికి చెందిన సుదర్శనకుమార్ తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 5 లీటర్ల 750 ఎంఎల్ (ఆరు మద్యం సీసాలను) స్వాధీనం చేసుకున్నారు.

మాగుంటకు కొండ్రెడ్డి పరామర్శ

నెల్లూరు(బారకాసు) : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బుధవారం నెల్లూరులోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల మాగుంట శ్రీనివాసులురెడ్డి బైపాస్ సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండ్రెడ్డి ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పార్టీ నేతలు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సీహెచ్ హరిబాబు యాదవ్, ఎంబేటి ఏసు నాయుడు, శ్రీధర్‌బాబు తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్ మున్సిపల్, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పనితీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన నగరంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో వీధుల్లో తాగునీటి పైపుల నుంచి నీరు వృథాగా పోతుండడాన్ని బుధవారం గుర్తించారు. ఇళ్లకు బిగించిన పైపుల నుంచి నీరు వృథాగా పోతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఎన్ని రోజుల నుంచి పోతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శులు వార్డుల్లో పర్యటించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న సీపీఎం నేత మురళి పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.



వృథాగా పోతున్న నీటిని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను సత్కరిస్తున్న అధ్యాపకులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు





- డీకేడబ్ల్యూ కళాశాలలో ఘనంగా 60 వసంతాల వేడుక
- తరలివచ్చిన పూర్వ విద్యార్థినులు

అంబరాన్నంటిన వజ్రోత్సవ సంబరం

నెల్లూరు (టౌన్) : నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ఏర్పడి 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు బుధవారం అంబరాన్నంటాయి. ఈ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఒక్కచోట చేరి వారి ఆనందాలను పంచుకున్నారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఏఐ సహాయంతో కళాశాల విద్యార్థినులు జయాంజలి, భాను రూపొందించిన దొడ్ల కౌసల్యమ్మ సందేశాన్ని వినిపించారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుకున్న ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారంత కళాశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు కోరారు. డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన డాక్టర్ శారతకు తాను శిష్యుడని, ప్రస్తుతం ఇక్కడ ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నూతన విద్యా విధానం లక్ష్యాలను విద్యార్థులకు మరింత చేరువ చేసి కళాశాలలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు.

నేను ఇక్కడే చదివాను – జెడ్పీ చైర్‌పర్సన్

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ తాను డీకేడబ్ల్యూ కళాశాలలో చదవానని, మా కుటుంబానికి, కళాశాలకు ఎంతో అనుబంధం ఉందన్నారు. కళాశాల అభివృద్ధిలో మా వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

పూర్వ విద్యార్థినుల సహకారం అభినందనీయం

నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుకున్న వారు నేడు అన్ని రంగాల్లో ముందున్నారని, ప్రస్తుతం పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ 60 వసంతాల చరిత్రలో ఎందరో మహిళామణులు ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. ఎన్ఈపీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఒక చేతితో డిగ్రీ, మరో చేతితో ఉద్యోగావకాశం అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని, మంత్రి నారాయణ సతీమణి ఇందిర మాట్లాడుతూ ఎందరో స్త్రీల జీవితాల్లో వెలుగులు నింపిన దొడ్ల కౌశల్యమ్మ దాతృత్వానికి మేం రుణపడి ఉన్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సునంద మాట్లాడుతూ స్త్రీ విద్యాభివృద్ధికి డీకేడబ్ల్యూ కళాశాల కృషి గణనీయమైనదన్నారు. పూర్వ విద్యార్థినుల సంఘం అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, కార్యదర్శి కుసుమకుమారి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. అనంతరం అతిథులు, పూర్వ అధ్యాపకులను సన్మానించారు.



యోగక్షేమాలు తెలుసుకుంటూ..



సెల్ఫీలు దిగుతున్న పూర్వ విద్యార్థినులు

జ్ఞాపకాలను నెమరేసుకుంటూ..

కళాశాల ఏర్పడిన నాటి నుంచి చదువుకున్న ఎందరో పూర్వ విద్యార్థినులు ఒకేచోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. సెల్ఫీలు తీసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత కలవడంతో తమ భావోద్వేగాలను పంచుకోవడంతో పాటు తమ సంతోషాలను వ్యక్తం చేసుకున్నారు.